క్లుప్తంగా

లంచం తీసుకోవడం నేరం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో శనివారం ఫిరంగిపురం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ రాధిక మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం ఎంతో అవసరమని చెప్పారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులచే అవినీతి రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కవిప్రియ, శేషుకుమార్, సచివాలయం సిబ్బంది భారతి, ప్రభాకర్, గోపి, ప్రసన్న, శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం కమల్‌మోహన్‌లు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిరిపురం గ్రామానికి చెందిన సుధాకర్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు శౌరెడ్డి వైఎస్సార్ బీమా పథకం కింద రూ. ఐదు లక్షల చెక్కు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి తోకల వెంకటేశ్వర్లు, జిలానీ, వెల్ఫేర్ అసిస్టెంట్ జావిద్, శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నేతలు మణిపాల్, జోసఫ్‌రెడ్డి, వలంటీర్లు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ మంచికలపూడి గ్రామస్తులకు కంతంరాజు కొండూరులో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అక్కడకు వెళ్లి ఇళ్లు ఎలా నిర్మించుకుంటారని ప్రశ్నించారు. గ్రామంలోనే వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. గ్రామంలో సచివాలయం లేదని, సచివాలయ పనుల నిమిత్తం మోరంపూడి గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని, వెంటనే సచివాలయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, వై. స్టాలిన్, ఎ.పాములు, బి.అమ్మిరెడ్డి, వై.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సంసిద్ధంగా ఉండండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మాట్లాడుతున్న కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, జేసీఎస్ మండల కన్వీనర్లు, ఎన్నికల మండల కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలు గుర్తించిన వెంటనే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. గ్రామాల్లో ఓటర్ల నమోదు, గృహ సారథుల ఇన్స్యూరెన్స్ తదితర విషయాలను పూర్తి చేయాలని కోరారు. మండల కమిటీలు, గ్రామ అధ్యక్షుల నియామకాలు త్వరలో పూర్తి చేయాలని, పల్లె నిద్ర, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ నాటికి గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం ఉంటుందని, నియోజకవర్గంలో త్వరలో జరగనున్న బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం ఎంపీపీ సహేలా నర్గిస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హెచ్ఆర్ఏ పెంపు హర్షణీయం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉద్యోగుల హెచ్ఆర్ఏ పెంపు హర్షణీయమని ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల హెచ్ఆర్ఏ 12 శాతం నుంచి 16 శాతం పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో శనివారం ఎన్జీవో సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి హెచ్ఆర్ఏ 12 శాతం 16 శాతానికి పెంచాలని కోరుతున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చొరవ అభినందనీయమన్నారు. 4వేల నుంచి 4500 మంది ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మంగళగిరి తాలుకా యూనిట్ అధ్యక్షుడు కె శ్రీరాములు, కార్యదర్శి డి బాలనాగేశ్వరరావు, సహాయ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గజ్జలకొండ నాగబ్రహ్మం, ఎన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మజూరి పెంచాలని చేనేత కార్మికుల ప్రదర్శన

మంగళగిరి: మజూరి పెంచాలంటూ చేనేత కార్మికు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన శనివారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పాత మంగళగిరి భావనాఋషి కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన ప్రదర్శన పట్టణంలో ప్రధాన వీధుల గుండా సాగి షరాఫ్ బజార్‌లోని చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయం వద్దకు చేరుకుంది. సమన్వయ కమిటీ నాయకులు చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి రావెల శివసత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. గత రెండు సంవత్సరాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల మజూరి 50 శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సత్యనారాయణ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు సమన్వయకమిటీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, రామనాథం పూర్ణచంద్రరావు, భీమిశెట్టి బాలతేడేరు, గుత్తికొండ ధనుంజయరావు, జంజనం వెంకటసుబ్బారావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తూరి మోహనరావు, కూరపాటి కోటేశ్వరరావు, వి దుర్గాప్రసాద్, డోకిపర్తి రామారావు, సాధు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

ఫిరంగిపురం: నూతనంగా ఓటు హక్కు కోసం అర్హులైన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ పద్మనాభుడు అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలోని పోలింగ్ బూత్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతన ఓటు కోసం ఫారం 6,7,8 అందజేయవచ్చని చెప్పారు. పోలింగ్ బూత్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడికొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మండల అధికారులు శనివారం పరిశీలించారు. రెండు రోజులపాటు ఈ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ శ్రీనివాసశర్మ తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారి నాగరాజు, ఈఓపీఆర్డీ రవికుమార్, హౌసింగ్ ఏఈ దివ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ అందజేత



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సంజీవ్‌నగర్‌కు చెందిన యువ క్రీడాకారులకు వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ అందజేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, సచివాలయ కన్వీనర్లు సింహాద్రి గోపి, మేడిపల్లి మణికుమార్, బోయిలపల్లి రాజు, బత్తుల వెంకటేశ్వరరావు, కొండ పాల్గొన్నారు.

సకాలంలో నీరు అందించాలి

పొన్నెకల్లు(తాడికొండ): వర్షం లేక ఎండిపోతున్న మిర్చి పంటలకు ప్రభుత్వం సకాలంలో నీరందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి కోరారు. తాడికొండ మండలం పొన్నెకల్లు, రావెల, గ్రామాల్లో మిర్చి పంటను ఆయన శనివారం పరిశీలించారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

జెమ్స్ స్కూలులో టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



మంగళగిరి: చిన్నతనం నుంచే విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. శుక్రవారం నగర పరిధిలోని కాజలో ఉన్న జెమ్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో 67వ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడలు మానవ జీవితంలో అతి ముఖ్యమైనవని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో పాల్గొని రాణించడం ద్వారా తమ ఆరోగ్యాలను మెరుగుపర్చుకోవడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో డీవైఈవో పి వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ ప్రసన్న, రాష్ట్ర స్కూలు గేమ్స్ పరిశీలకులు రాధాకృష్ణ, జిల్లా స్కూలు గేమ్స్ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, మాజీ కార్యదర్శి పేరం మస్తానరెడ్డి, స్కూలు క్రీడా కార్యదర్శి పీవై కొండారెడ్డి, అండర్–14,17 పరిశీలకుడు శరవన్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాట్యస్వర పోటీలు

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన నాట్యస్వర పోటీలు శనివారం ముగిశాయి. పోటీలలో ఎస్ఆర్ఎం, వీఐటి, పీబి సిద్ధార్థ, వీవీఐటి యూనివర్సిటీల నుంచి 80 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. శాస్త్రనృత్య పోటీలలో వీఐటీ యూనివర్సిటీకి చెందిన లాస్య టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. క్లాసికల్, వెస్టర్న్, సంగీత నృత్య పోటీలను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. డాక్టర్లు సునీత, విశ్వనాథ్, నయంతన్ ఠాకూర్, వెంకటరత్నం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. శాస్త్రీయ సంగీత పోటీల్లో(సోలో) సిద్ధార్థ కళాశాల, ఎస్ఆర్ఎంలకు చెందిన శివానంద లక్ష్మి, అశ్వర్థ లక్ష్మిలు మొదటి రెండు స్థానాలు పొందారు. నృత్య పోటీలలో వీఐటీ యూనివర్సిటీకి చెందిన శ్రేయ కుమార్, పి అతినాలు బహుమతులు దక్కించుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను తాడేపల్లి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి ఎస్ఈబీ సీఐ మారయ్య ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించి ఉండవల్లి అమరావతి కరకట్టపై ఎటువంటి బిల్లులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండడంతో పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారని, ట్రాక్టర్‌పైన, ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ కొనికల సాయికుమార్‌లపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. నూతక్కి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన అండర్–14 విభాగంలో ఎస్.రోహిత్, అండర్–17 విభాగంలో సీహెచ్ తేజ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను, పీడీలు మెల్లెంపూడి రవి, డి.సుజాతలను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాష్‌రావు, గ్రామ సర్పంచ్ పి.మేరమ్మ తదితరులు అభినందించారు.

